క్లుప్తంగా

పీర్ల చావిడికి రూ.లక్ష విరాళం



కుర్లపల్లి గ్రామస్తులకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో పీర్ల చావిడి నిర్మాణానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులకు నగదు అందించారు. మండల ప్రజాప్రతినిధులు ద్వారా గ్రామంలో పాడైన పీర్ల చావిడి అభివృద్ధి కోసం సహాయం అందించాలని గ్రామస్తులు కోరటంతో, ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, కుర్లపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

అనంతపురం సెంట్రల్: ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని పిలుపునిచ్చారు. నగరంలో ఆర్టీసీ కార్యాలయంలో ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపు ఆవశ్యకతపై ఐదు రోజుల పాటు ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఆర్ఎం మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవర్లందరూ ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. ట్రైనర్ జేవీ రావు మాట్లాడుతూ రోజూ సర్వీసులు సరైన సమయంలో నడిపే విధంగా డ్రైవర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డిపో మేనేజర్ సురేష్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ జయచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంబరాలు

అనంతపురం సిటీ: వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ జీఓ ఎంఎస్ 60 విడుదల చేసిన సందర్భంగా ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో అనంతపురంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోజెస్ ప్రభాకర్, సూపరింటెండెంట్ భాస్కర్‌రెడ్డి, ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కిశోర్, ఎన్జీఓ నగర అధ్యక్షుడు, జేఏసీ గౌరవాధ్యక్షుడు శ్రీధర్‌బాబు, అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో కార్యక్రమం నిర్వహించారు.

ఇసుక బస్తా మోసే పోటీలు



150 కిలోల ఇసుక బస్తా మోస్తున్న హమాలీ

అనంతపురం అర్బన్: మేడే సందర్భంగా హమాలీలకు 150 కిలోల ఇసుక బస్తా మోసే పోటీలను సిటీ హమాలీ సంఘం, సీఐటీయూ సంయుక్తంగా మంగళవారం నిర్వహించింది. స్థానిక తాడిపత్రి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా కార్మికుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. పోటీలో గెలుపొందిన హమాలీలకు ప్రథమ బహుమతి రూ.8 వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు, తృతీయ బహుమతి రూ.4 వేలు, నాల్గో బహుమతి రూ.2 వేలు సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ అందించారు. హమాలీ సంఘం నాయకులు ఆదినారాయణ, గౌరప్ప, వెంకటేశులు, చంద్రప్ప, రాజన్న, నారాయణస్వామి, రామాంజనేయులు, మనోహర్, పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్ ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న రాస్తారోకోలకు వామపక్షపార్టీలు ఇప్పటికే మద్దతు తెలిపాయన్నారు. ఈ పోరాటంలో బీజేపీయేతర పార్టీల మద్దతు కూడగట్టడంలో భాగంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ, తదితర పార్టీల నాయకులను కలిశామన్నారు. బుధవారం స్థానిక తపోవనం సర్కిల్ జాతీయ రహదారి వద్ద తలపెట్టిన రాస్తారోకో లో పాల్గొనాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిని క్రమశిక్షణతో గడిపేద్దాం..

విద్యార్థులు ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టారు.. వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి...ఇక రెక్కలొచ్చిన పక్షుల్లా ఇళ్ల వద్ద సరదాగా సెలవులు గడపాలని పిల్లల్లో ఉంటుంది. అయితే ఓవైపు మేనెల ఎండలు మరింత మండుతున్నాయి. టీవీలతో, మొబైళ్లతో సమయం వృథా చేస్తారని తల్లిదండ్రులకు బెంగ ఉంటుంది. వినోదం, వికాసం, విజ్ఞానం అందించే శిక్షణా శిబిరాల్లో చేర్చాలని ఆశపడుతుంటారు. అలాంటి వారికోసం, పిల్లల్లో దాగున్న ప్రతిభాపాటవాలు వెలికితీయడం కోసం నగరంలో అనేక శిక్షణ శిబిరాలు వెలిశాయి. ఎక్కడెక్కడ వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలనే వారి కోసం 'సాక్షి' ప్రత్యేక కథనం.

– అనంతపురం కల్చరల్:



పేర్లు నమోదు చేసుకుంటున్న దృశ్యం



బాలికలకు నృత్యం నేర్పిస్తునన శిక్షకురాలు

సంస్కృత సంభాషణ..



సంస్కృత భారతి వారి ఆధ్వర్యంలో దశదిన సంస్కృత సంభాషణ శిబిరం అశోక్‌నగర్‌లోని శ్రీ సరస్వతీ విద్యామందిరంలో జరగనుంది. ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుంది. వివరాలకు సెల్: 9491509690లో సంప్రదించాలి. సీనియర్ డ్యాన్స్ మాస్టర్ వన్నూర్ ప్రతి వేసవిలో వెస్ట్రన్, ఫోక్ డాన్సుల్లో పాతూరులో శిక్షణనిస్తాడు. వివరాలకు 9866924601లో సంప్రదించాలి.

కోలాటం, జానపదాలలో ..



స్థానిక సోమనాథనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో ఓం సంగీత శిక్షణా కేంద్రం వారు నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య శిక్షణనిస్తున్నారు. కోలాటం, శాస్త్రీయ నృత్యం, జానపదం, కూచిపూడి, నిత్యశ్లోకాలు, నేర్పిస్తారు. వివరాలకు సెల్: 8790601221లో సంప్రదించాలి.

డబ్బింగ్ హంగామా...



స్థానిక మూడో రోడ్డులోని శారదా సమాజంలో డబ్బింగ్ వర్క్ నేర్చుకోవాలనుకునే చిన్నారులకు ప్రత్యేకంగా మక్బూల్ బాషా శిక్షణ ఇస్తున్నారు. వెస్ట్రన్, ఫోక్ డాన్సుల్లో రోజూ ఉదయం సాయంత్రం శిక్షణ ఉంటుంది. 9949235177 నంబర్‌లో సంప్రదించాలి.

డ్రాయింగ్, పెయింటింగ్‌లో..



స్థానిక కృష్ణకళామందిరంలో కళాసాగర్ ఆధ్వర్యంలో వెస్ట్రన్ డాన్సులతో పాటూ డ్రాయింగ్, పెయింటింగ్, కరాటే తదితర అంశాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి కత్తి విజయ్‌కుమార్ శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా స్త్రీలకు ప్రత్యేకంగా ఆర్ట్ వర్క్ నేర్పిస్తారు. వివరాలకు సెల్: 8309332848లో సంప్రదించొచ్చు.

వెస్ట్రన్ డ్యాన్స్‌లో ..



స్థానిక రామనగర్, రుద్రంపేట, కోర్టురోడ్డుల్లో వేర్వేరుగా పూర్తి స్థాయి వెస్ట్రన్, సినీ, సెమీ క్లాసిక్ తదితర వాటిల్లో మాస్టర్ విష్ణు సమ్మర్ క్యాంప్ సంబరాలు నిర్వహిస్తున్నారు. వివరాలకు సెల్: 9849563043లో సంప్రదించాలి.

ఫిల్మ్ మేకింగ్‌లో..



వేణుగోపాలనగర్‌లో ఏరోబిక్స్, జుంబో డాన్సు, ఫిల్మ్ మేకింగ్ తదితర వాటిల్లో మాస్టర్ హరిప్రసాద్ ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. సమాచారం కోసం 9849918534 నంబర్‌లో సంప్రదించాలి.

కర్రసాములో...



వన్నూరు శిష్యులైన వాణి, మోనిక సంప్రదాయ కర్రసాములో జాతీయ స్థాయి కీర్తి గడించారు. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల వారి సహకారంతో శిక్షణ అందిస్తున్నారు. మరిన్ని వివరాలకు 9493520282 నంబర్‌లో సంప్రదించాలి.

ముఖ్యమంత్రిని మరోమారు ఆశీర్వదించండి

- గడప గడపకూలో కోరిన ఎమ్మెల్యే తోపుదుర్తి



గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాప్తాడురూరల్:అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు దీవించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ సచివాలయం-3 పరిధిలోని జాకీర్‌కొట్టాలు, సుందరయ్యకాలనీ, బీఎస్ఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ×గడప గడపకూ మన ప్రభుత్వం£ కార్యక్రమం చేపట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటా తిరిగిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ముఖ్యమంత్రి పేరుతో వచ్చిన లబ్ధిపత్రాలను ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ఓ వైపు వివరిస్తూ, మరోవైపు ప్రజల వ్యక్తిగత సమస్యలను తెలుసుకుంటూ ఆర్థిక భరోసా కల్పిస్తూ ముందుకు వెళ్లారు. జగనన్న పాలన ఎలా ఉంది తల్లీ...అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అక్కచెల్లెమ్మలను అడిగారు. వివిధ పథకాల ద్వారా రూ.లక్షలు తమ బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని మహిళలు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు ¬మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ తేజశ్విని, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గాయత్రిదేవి, వడ్డే శీనా, నాయకులు ధనుంజయయాదవ్, యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు వలి, రామస్వామి, రెడ్డప్ప, బాషా, అన్ను, జాఫర్, సలీం పాల్గొన్నారు.


అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాప్తాడు: మండల పరిధిలోని మరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2002-2003 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు, నాటి గురువులు పాఠశాలలో కలిశారు. హెచ్ఎం చేన్నకేశవులు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జాతీయ జెండా ఆవిష్కరణ, రాష్ట్ర, జాతీయ గీతాలాపనలతో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా అప్పటి హెచ్ఎం ఆజాద్ బాషా పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థులు దాసరి కర్ణా, వీరా, రమేష్, పసుపుల నరసింహ, కుళ్లాయప్ప, శీనా, రాజేష్, మధు తదితరులు మాట్లాడారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు పంపిణీ చేశారు. తోటి విద్యార్థినీ విద్యార్థులు ఎం.చెర్లోపల్లికి చెందిన భాగ్యలక్ష్మీ భర్త గంగప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో రూ.17,500, కృష్ణాపురం శివయ్య భార్య శ్రీదేవికి రూ.17,500, చాపట్ల రామాంజికి డయాలసిస్ చేయించుకోవడానికి రూ.15 వేలు, పర్వతదేవరపల్లికి చెందిన మల్లికార్జున కుమారుల పేరిట రూ.50 వేలు డిపాజిట్ చేయించారు.

విషపుగుళికలు మింగి రైతు బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో గువ్వల సూర్యనారాయణరెడ్డి (57) ఊజీమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు..గువ్వల సూర్యనారాయణరెడ్డి , గువ్వల రత్నమ్మ దంపతులు. సూర్యనారాయణరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంటినుంచి వెళ్లి ఎంతసేపటికీ రాలేదు. అనుమానం వచ్చి భార్య,కుమార్తె గాలించారు. దారిలో అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని చూసి వెంటనే స్థానికుల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సూర్యనారాయణరెడ్డి మృతి తీరనిలోటు : వైఎస్సార్‌సీపీ నాయకుడు గువ్వల సూర్యనారాయణ రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి వెళ్లి సూర్యనారాయణరెడ్డి మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాచానపల్లి సర్పంచ్ అంజియాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి, ఎద్దుల రామకృష్ణారెడ్డి, భానుకోటశివ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం చేసిన మేలు మరువం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ప్రజలు



సూర్యనగర్ రోడ్డు ఐరన్ బ్రిడ్జ్ సమీపంలోని వీధిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ×ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేశారు.. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి పథకాలు మంజూరు చేయిస్తున్నారు£ అని సూర్యనగర్‌కు చెందిన వృద్ధురాళ్లు, మహిళలు చెన్నమ్మ, లింగమ్మ, సుమిత్ర ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ఆనందాన్ని పంచుకున్నారు. మంగళవారం నగరంలోని 14వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ అబూసలేహాతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మేలును ఎమ్మెల్యే అనంత లబ్ధిదారులకు వివరించారు. సూర్యనగర్ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నిర్వాసితుల ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేయూత, పింఛన్, డ్వాక్రా రుణంతో తన కుమారుడు పవన్‌కుమార్‌కు ఫైనాన్స్‌లో ఆటో తీయించామని, తద్వారా ఇల్లు నడుస్తోందని లింగమ్మ అనే వృద్ధురాలు సంతోషాన్ని వ్యక్తం చేసింది. కామాక్షి అనే మహిళ చేయతూ వస్తూ బ్రేక్ అయ్యిందని ఎమ్మెల్యేకి విన్నవించారు. సూర్యనగర్‌లో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.

రోడ్లు, కాలువలకే రూ.600 కోట్లు వెచ్చించాం

నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా రోడ్లు, కాలువలకు మాత్రమే రూ.600 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత తెలిపారు. గడప గడప కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడప గడపకూ కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు.

ఇప్పటికే ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల చొప్పున రూ.15 కోట్ల వరకు అభివృద్ధి పనులకు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, భూమిరెడ్డి జాహ్నవి, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, మల్లికార్జున, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, పార్టీ నగరాధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మేదర కృష్ణ, అనిల్‌కుమార్ గౌడ్, మదార్‌వలి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్కమ్మగార్ల జలధి



దేవతల జలధి గంపను ఎత్తుకొస్తున్న పూజారి



పొలాల వెంట పరుగులు తీస్తూ వస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో దేవల తోటలో వెలసిన తిరుగడ అక్కమ్మగార్ల పరుష మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరుషలో భాగంగా అమ్మవారికి జలధి కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు సమీపంలోని ఓ తోటలోని కొలనులో జలధిపూజ చేశారు. అక్కడ నుంచి పూజారులు అక్కమ్మ దేవతలు ఉన్న గంపను ఎత్తుకొని పొలాల్లో వస్తుండగా, గంప వెంట వేలాది మంది భక్తులు పరుగులతీస్తూ వచ్చారు. అనంతరం జలధి గంప ఆలయానికి చేరుకోవడంతో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం పరుషతో పాటు పన్నేరపుబండ్ల ప్రదర్శన ఉంటుంది. ఆలయం వద్దనే రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లతో పాటు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు సామూహిక ధర్మోపనయనాలు

అనంతపురం కల్చరల్:బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం సామూహిక ధర్మోపనయనాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు టీఎస్ శివసాయిరాం మంగళవారం వివరాలు తెలిపారు. స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో 28 మందికి త్రిమత బ్రాహ్మణ వధువులకు ఉచితంగా ఉపనయనాలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: నగరంలోని 14, 15వ డివిజన్లలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కమలానగర్‌లోని డీసీఎంఎస్ నుంచి ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

అనంతపురం అర్బన్: కొత్త అక్రిడిటేషన్ల మంజూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎం.గౌతమికి ఏపీయూడబ్ల్యూజే నాయకులు విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి స మస్యలు విన్నవించారు. కొత్తగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, కెమెరామెన్లు, వీడియోగ్రాఫర్లు, సబ్‌ఎడిటర్లు గతంలో మాదిరిగా ఉమ్మడి జిల్లాకు చెందిన వారే కొనసాగుతున్నారన్నారు. వీరందరికి ఉమ్మడి జిల్లా లో చెల్లుబాటయ్యేలా అక్రిడిటేషన్ మంజూరు చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

విధుల్లోకి జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) భాస్కరరెడ్డి మంగళవారం విధులకు హాజరయ్యారు. అనారోగ్య కారణాలతో మూడ్రోజుల క్రితం ఆయన సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. ఆరోగ్యం కుదుటపడడంతో మంగళవారం ఆయన యథావిధిగా విధులకు హాజరయ్యారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తన భర్త వేధింపుల నుంచి కాపాడాలంటూ అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన శిరీష మంగళవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం కుర్లి గ్రామానికి చెందిన ఆమెను నీరుగంటి వీధికి చెందిన పవన్‌కు ఇచ్చి ఏడు నెలల క్రితం పెద్దలు పెళ్లి జరిపించారు. కాగా, డబ్బుమీద వ్యామోహంతో భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు.

5న మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడురూరల్: ఈనెల 5న ఉదయం 9 గంటలకు అనంతపురం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ తెలిపారు. 11 డైరెక్టర్ స్థానాలకు మొత్తం 30 నామినేషన్లు దాఖలు కాగా, అన్నీ సక్రమంగా ఉన్నాయని వివరించారు. నామినేషన్ల ఉపసంహరణ బుధవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. బరిలో నిలిచే అభ్యర్థులకు వెంటనే గుర్తులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి దాతృత్వం



చెక్కును వీసీ రంగజనార్ధనకు అందిస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి పి. పరంధామయ్య రూ.10 లక్షల విరాళాన్ని మంగళవారం ప్రకటించారు. ఈ మొత్తాన్ని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి వెచ్చించాలని తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు ప్రాంతానికి చెందిన పరంధామయ్య 1970లో జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఏపీఎస్‌పీడీసీఎల్‌లో డీఈగా పదవీ విరమణ చేసిన పరంధామయ్య.. తాను ఉన్నత స్థాయికి చేరడానికి దోహదపడిన కళాశాలకు రూ.10 లక్షల విరాళాన్ని అందించడం అభినందనీయమని వీసీ జింకా రంగజనార్ధన తెలిపారు. ఈ మొత్తాన్ని ప్లాటినమ్ జూబ్లీ హాస్టల్ భవన నిర్మాణానికి కేటాయించాలన్నారు. చెక్కును రిజిస్ట్రార్ సి.శశిధర్, జేఎన్‌టీయూ అనంతపురం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత జేఎన్‌టీయూ అనంతపురం వీసీకి అందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం. విజయకుమార్, జేఎన్‌టీయూఏ విశ్రాంత ప్రొఫెసర్ వి. శంకర్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న ఆదిరెడ్డి పరదేశి నాయుడు

అనంతపురం సిటీ: అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య సూక్ష్మ జీవ శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న ఆదిరెడ్డి పరదేశి నాయుడుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. చెన్నైలోని భారత్ యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్‌డీ అందుకున్నారు. 2016 జూలైలో చెన్నైలోని భారత్ యూనివర్సిటీలో పీహెచ్‌డీలోకి ప్రవేశం పొందిన ఆయన.. డెంగీ వ్యాధిపై పరిశోధన చేశారు. చెన్నైలోని బాలాజీ మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ చిత్రలేఖ చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ అందుకున్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించండి

అనంతపురం క్రైం: వాయిద్య కళాకారులకు శిక్షణ, జీవనోపాధికి సంబంధించి పిల్లలకు వాయిద్యం నేర్పించేందుకు కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని నాయీబ్రాహ్మణులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో నాయీబ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు నర సింహులు, ఎం రామకృష్ణ, ఎం. శ్రీనివాసులు, నాగేంద్ర, సూరి, రాము పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అనంతపురం క్రైం: నగరంలోని 22, 28వ డివిజన్లలో రూ.1.3 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ వసీం మంగళవారం పరిశీలించారు. మేయర్ వెంట కార్పొరేటర్ లీలావతి, నాయకులు రవి, ఖాజా, పాల్గొన్నారు.

7న ఉచిత ఖత్నా

అనంతపురం సిటీ: గఫూర్ కాలనీలో ఈ నెల 7న ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నా (వడుగులు) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బహుళార్థక సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ గఫూర్ మంగళవారం తెలిపారు.

6న ఎంటీఎస్ టీచర్ల సమావేశం

రాప్తాడురూరల్: అనంతపురం నగరంలోని శ్రీమేథా జూనియర్ కళాశాలలో నూతనంగా నియమించబడిన 98-డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల అత్యవసర సమావేశం ఈనెల 6న ఏర్పాటు చేస్తున్నట్లు టీచర్లు రెడ్డప్పరెడ్డి, హుసేన్‌వలి, వెంకటేష్, శ్రీనివాసులు, జిలాన్‌బాషా, జాకీర్‌హుసేన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న 98– డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

9,10 తేదీల్లో మహాసభలు

అనంతపురం టవర్‌క్లాక్: ఈనెల 9,10వతేదీల్లో స్త్రీ విముక్తి సంఘటన మహాసభలు జరగనున్నట్లు అధ్యక్షులు విజయ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో మహాసభ పోస్టర్లు విడుదల చేశారు. విజయ మాట్లాడుతూ నగరంలోని జీఆర్ ఫంక్షన్ హాలులో మహాసభలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంఘటన నాయకురాళ్లు లక్ష్మి,లలిత, కొండమ్మ, అంజిత, మల్లీశ్వరి, ప్రమీల , రాధ, శ్రీలక్ష్మి, సరిత పాల్గొన్నారు.